విశాలాంధ్ర

నగరాన్ని ఎడారిగా మార్చొద్దు

పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ వీరభద్రాచారి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : నగరంలో చెట్లను నరకి నగరాన్ని ఎడారిగా మార్చొద్దని పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ జి. వీరభద్రాచారి పాలకులకు, నగరపాలక సంస్థ అధికారులకు విజ్ఞప్తి చేశారు.ఆదివారం ఆయన సంస్థ కార్యాలయంలో మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో నగరాన్ని కాంక్రీట్ జంగిల్‌గా మార్చుతూ అడ్డుగా ఉన్నాయన్న నెపంతో, ఎలాంటి ఆడ్డు లేకపోయినా విచక్షణారహితంగా, అడ్డ గోలుగా చెట్లను నరికి వేసి ప్రజలకు నిలువ నీడ లేకుండా చేస్తున్న నగరపాలక సంస్థ మరియు కాంట్రాక్టర్ల పని తీరు పర్యావరణానికి ప్రమాదంగా మారిందన్నారు.ఒక వైపు వేసవి రెండవదశ కొనసాగుతున్నది అన్నట్టుగా ఎండలు మండు తుంటే,మరోవైపు చెట్లు తొలగిస్తున్న తీరు విస్మయాన్ని కలిగిస్తోందన్నారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

పారిశుధ్య నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-కనిగిరి : పారిశుద్ధ్యం పై అలసత్వం వహిస్తే ప్రభుత్వపరమైన కఠిన చర్యలు తీసుకోనున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 8వ వార్డులో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పర్యటించారు. ఆయన మాట్లాడుతూ వార్డులో మురికి చెత్త చెదారాలు వల్ల దుర్వాసన వస్తుందని ప్రజలు తెలుపగా వెంటనే స్పందించి మున్సిపల్ కార్మికులచే అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో పరిశుభ్రం చేయించడం జరిగింది. వార్డులో పారిశుద్ధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించి అపరిశుభ్రమైన ప్రాంతాన్ని పరిశుభ్రం చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని పారిశుధ్యం పై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు మున్సిపల్ మరియు సచివాలయం శానిటరీ సిబ్బందికి సూచించారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇంచార్జి ఇన్స్పెక్టర్ చెన్న కేశవులు శానిటరీ సెక్రటరీ లోకేష్ కౌన్సిలర్ జాస్మిన్ ఆజాద్ సచివాలయ సిబ్బంది మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాలో సీపీఐ బస్సు యాత్ర

విశాలాంధ్ర-ఒంగోలు : రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి నినాదంతో సీపీఐ రాష్ట్ర సమితి చేపట్టిన బస్సు యాత్ర సోమ, మంగళవారాలలో జిల్లాలో పర్యటించనుంది. ఈనెల 28వ తేదీన సోమవారం ఉదయం 10గంటలకు మల్లవరం ప్రాజెక్టను సీపీఐ రాష్ట్ర బృందం సందర్శిస్తారు.అనంతరం ఒంగోలులోని కర్నూల్ రోడ్డు ఫ్లై ఓవర్ వద్ద నుండి నెల్లూరు బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు మల్లయ్యలింగం భవన్‌లో రైతాంగ సమస్యలపై నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కె రామకృష్ణ, సిపిఐ నాయకులు జి. ఈశ్వరయ్య, కె.వి.వి. ప్రసాద్, రైతు నాయకులు వడ్డే శోభనాదీశ్వరరావు, కాంగ్రెస్ రైతు నాయకులు కె. కోదండరామ్, ఇతర రైతు సంఘాల నాయకులు పాల్గొంటారు.సాయంత్రం 5గంటలకు మార్కాపురంలో ర్యాలీ,6గంటలకు బహిరంగ సభ జరుగుతుంది. అలాగే 29వ తేదీ మంగళవారం ఉదయం 10.30 నిమిషాలకు కనిగిరి లో ర్యాలీ 11గంటలకు పామూరు బస్టాండ్ సెంటర్లో బహిరంగ సభ జరుగుతుంది. భోజనం అనంతరం బయలుదేరి నెల్లూరు వెళతారు. సీపీఐ నిర్వహిస్తున్న బస్సు యాత్రను జిల్లాలో జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

29న సీపీఐ బహిరంగ సభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : భారత కమ్యూనిస్టు పార్టీ మండల సమితి రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ రాష్ట్ర సమితి చేపట్టిన బస్సు యాత్ర ఆగస్టు 17వ తేదీన విశాఖపట్నంలో ప్రారంభమై సెప్టెంబరు 17వ తేదీన తిరుపతిలో ముగింపు జరుగుతుంది. ఈ బస్సు జాత ఈ నెల 29వ తేదీన ఉదయం 10 గంటలకు కనిగిరి అనీఫ్ స్తూపం వద్ద నుండి ర్యాలీగా బయలుదేరి అనంతరం పామూరు బస్టాండ్‌లో బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుంది. ఈ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ సిఎస్పురం మండల ప్రధాన కార్యదర్శి ఎస్కెవై పెద్దమస్తాన్ రైతు సంఘం జిల్లా కన్వీనర్ మోరేబోయిన వెంకట కొండ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలో నల్లమడుగుల గ్రామంలో బ్రహ్మంగారి కాలనీలో బస్సు యాత్రకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించడం జరిగింది. రైతు నాయకులు ఆరు అంకయ్య, గిరిజన నాయకులు నియోజకవర్గ నాయకురాలు రాగి ఎంకమ్మ, జయంబు గురవయ్య, ఏడుకొండలు, వై రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూలింగ్ వాటర్ ఫ్రిజ్ బహుకరించిన ఆకుపాటి

విశాలాంధ్ర-పామూరు : పట్టణ రెండవ ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ కుమారుడు నోహిత్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ మదన వేణుగోపాల స్వామి దర్శనార్థంకి వచ్చే భక్తులకు ఉచిత మంచినీరు అందించే ఉద్దేశంతో కూలింగ్ మినరల్ వాటర్ ఫ్రిజ్ ను దేవస్థాన చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లుకు అందివ్వడం జరిగింది. మొదటి పుట్టినరోజు మరియు రెండో పుట్టిన రోజులకు గతంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. తొలుత శ్రీ మదన వేణుగోపాల స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు మిత్రులు అర్చకులు నోహిత్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. ఈ వేడుకలో శ్రీ మదన వేణుగోపాల స్వామి దేవస్థానం చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, దేవస్థాన ప్రధాన అర్చకులు సత్యబాబు, నీరుకట్టు నాయబ్ రసూల్, గాడి మాలకొండయ్య, పుప్పాల రామ్మూర్తి, జై చంద్ర, వల్లం విజయ్ తదితర ఆకుపాటి మిత్రులు పాల్గొన్నారు.

మహిళా శక్తి పథకాలు ఇంటింటా ప్రచారం

విశాలాంధ్ర-పామూరు : తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో మహిళా శక్తి పథకాలను తెలుగు మహిళలు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పట్టణంలోని డివి పాలెంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో బూటకపు సంక్షేమ పథకాల పేరుతో వైసిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్ర అభివృద్ధిని వైసీపీ పాలకులు మర్చిపోయారని విమర్శించారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు ఓరుగంటి సుబ్బమ్మ, మద్ది శెట్టి రమాదేవి, షేక్ రహీమున్నీ, ఆవుల రవణమ్మ, జగదాభి రామనమ్మ, మండల తెలుగు రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య, కోటిరెడ్డి, ముబీన మౌలాలి, సత్యం, హజరత్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం ఫుల్...మంచినీళ్లు నిల్!

- పల్లెటూర్లలో ఏరులై పారుతున్న మద్యం
- పీసీపల్లి, పొన్నలూరు మండలాల్లో ఉన్నవి రెస్టారెంట్లా...బార్ అండ్ రెస్టారెంట్లా?
- గ్రామాల్లో రెస్టారెంట్లలో బహిరంగంగానే మద్యం అమ్మకాలు
- మద్యం షాపులకు అనుసందానంగా దందా
- అర్ధరాత్రి దాటినా అందుబాటులో మద్యం
- ఒక్కో గ్రామంలో అరడజనకు పైగా బెల్ట్ షాపులు
- పీసీపల్లి పొన్నలూరు మండలాల్లో జోరుగా అక్రమ మద్యం అమ్మకాలు
- మామూళ్ల మత్తులో సంబంధిత శాఖల అధికారులు
- చిత్తవుతున్న ప్రజారోగ్యం

విశాలాంధ్ర-పీసీపల్లి,పొన్నలూరు : పీసీపల్లి పొన్నలూరు మండలాల్లోని నాలుగు రెస్టారెంట్లు ఉన్నాయి. అయితే ఇవి రెస్టారెంట్లా... లేదా బార్ అండ్ రెస్టారెంట్లా అర్థం కాని పరిస్థితి ఉదయం 10:30 నుండి రెస్టారెంట్ల యజమానులు యథేచ్ఛగా రెస్టారెంట్లోనే మద్యం విక్రయాలు కొన సాగిస్తూ ఎంచక్కా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ విచ్చలవిడిగా వ్యవ హరిస్తున్నారు. ఇక పల్లెటూర్లలో అయితే మద్యం ఏరులై పారుతుంది. ఏ వీధిలో చూసినా బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా ఏ సమయంలోనైనా రెస్టారెంట్లలో బహిరంగంగా మద్యం బాటిళ్లు అందు బాటులో ఉంటున్నాయి. కిరాణా షాపుల్లోనూ మద్యం అన్నివేళలా అందుబాటులో దొరుకుతుంది. మంచినీళ్లు దొరకని గ్రామాలలో కూడా మద్యం ఏరులై పారుతుంది. దీనిని బట్టి చూస్తే అక్రమ మద్యం దందా ఏ విధంగా విస్తరిస్తుందో అర్థమైపోతుంది. పీసీపల్లి పొన్నలూరు మండలాల్లో మద్యం ఏరులైపారుతోంది కిరాణా షాపులు హోటల్స్ బడ్డీకొట్లు వీధి వీధిలో చూసినా బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నా. అర్ధరాత్రి అపరాత్రి అనే తేడాలేకుండా ఉదయం లేదు పగలు లేదు ఎప్పుడైనా ఎక్కడైనా ఫోన్ కొడితే చాలు క్వాటర్ బాటిల్ చేతిలో పడుతుంది. అర్ధరాత్రి వేళ పసిపిల్లలకు గుక్కెడు పాలు దొరకవు కానీ మద్యం మాత్రం పుష్కలంగా దొరుకుతుంది అంటే బెల్ట్ షాపులు మండలాల్లో ఏమేర విస్తరించి ఉన్నాయో ఇట్టే తెలిసిపోతుంది. పీసీపల్లి పొన్నలూరు మండలాల్లో మంచినీళ్లు దొరకని గ్రామాలైనా ఉన్నా యేమో కానీ మద్యం దొరకని గ్రామాలు మాత్రం భూతద్దంలో వెతికినా కనిపించని పరిస్థితి ఏర్పడింది. మండలాల్లో మద్యం మేరులై పారుతున్నా బెల్ట్ షాపులు గ్రామాల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రభుత్వం పేద బడుగు బలహీనవర్గాల బాగు కోసం సంపూర్ణ మద్య నిషేధంలో భాగంగా అన్ని మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహిస్తూ సేల్స్ మిల్లు సూపర్వైజర్లను అజమాయిసీలో నియ మించి ఎక్సైజ్ శాఖ అధికారులతో మద్యం వ్యాపారం చేస్తుంది పీసీపల్లి పొన్నలూరు మండలాల్లో నాలుగు ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. అయితే మండలంలో ఒక్కో గ్రామంలో అరడజనకు పైనే బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. కిరాణా దుకాణాలు బడ్డీకొట్లు టీ దుకాణాలు కూరగాయల షాపులలో మద్యం విక్రయాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఫ్లోరైడ్ పీడిత నియోజకవర్గంలోని మంచినీటి కంటే మందు పుష్కలంగా సరఫరా అవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు తెల్లవారకముందే ఉదయాన్నే పొలం వెళ్లే రైతులు లేదా ఇతర పనులకు వ్యాపారాలకు వెళ్లేవారు గతంలో ఇంట్లోనూ సెంటర్లోనూ టీ తాగి వెళ్లేవారు అయితే ఇప్పుడు టీ దుకాణాలకంటే ముందుగా బెల్ట్ షాపులు తెలుసుకుంటున్నాయి. ఉదయం నాలుగు గంటల నుండి అమ్మకాలు ప్రారంభిస్తున్నారు మద్యం తాగి పనులకు వెళుతున్న తీరు గ్రామాల్లో అలవాటుగా మారిందని మహిళలు వాపోతున్నారు. అధిక ధరలు వసూలు చేస్తూ బెల్ట్ షాప్‌ల నిర్వాహకులు ప్రతి క్వాటర్ సీసాకు అదనంగా రూ.50 రూపాయలు అధికంగా వసూలు చేస్తున్నారు. అంటే మండలంలో బీడ్స్ షాపుల నిర్వాహకుల తీరు ఏ మేరకు విస్తరించిందో అర్థం అయిపోతుంది.

ముడుపుల మైకంలో సంబంధిత శాఖల అధికారులు :

పత్రికలలో పలు కథనాలు వచ్చినప్పుడు హడావుడిగా సంబంధిత అధికారులు బెల్ట్ షాపులు రెస్టారెంట్లపై దాడులు చేయటం ఆపై బేరాలు కుదుర్చుకొని మూడో కంటికి తెలియ కుండా అక్కడి నుంచి మామూలే. ముడుపుల మైకంలో సంబంధిత శాఖల అధికారులు తీరు నిమ్మకు నీరెత్తినట్లు కనపడుతుంది. అధిక మొత్తంలో బెల్ట్ షాప్ నిర్వాహకులు రెస్టారెంట్ల యజమానులు వద్ద నుండి మామూళ్లు అందు తున్నడంతో అధికారులు ఎవరూ ఆ మండలాల వైపు కానీ గ్రామాల వైపు గాని కన్నెత్తి చూడటంలేదు.

దీంతో బెల్ట్ షాప్ నిర్వాహకుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి చెందుతుంది. నెలకు ఒకసారి మామూళ్ల కోసం వచ్చి వెళ్ళటం మినహా సంబంధిత శాఖ ఒకటి ఉన్నదన్న విషయం ప్రజలు కూడా మర్చిపోయారు. ఇటీవల మండలాల్లో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి తమ వాహనాలలో ఎక్కించుకొని కనిగిరి వెళ్లే లోపు మార్గమధ్యంలో బేరాలు కుదిర్చుకొని మూడో కంటికి తెలియకుండా బెల్ట్ షాపు నిర్వాహకులను వదిలేస్తుండటం గమనర్హం ఇదే అదునుగా భావించి బెల్ట్ షాప్ నిర్వాహకులు అధికారులకు ముడు పులు మొట్టగట్టి తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యంను అరికట్టి గొలుసు దుకాణాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సు యాత్రని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-దర్శి : దేశాన్ని కాపాడండి రాష్ట్ర రక్షించండి అనే నినాదంతో ఈ నెల 29వ తేదీ కనిగిరిలో జరుగు బస్సు యాత్రను జయప్రదం చేయాలని దర్శి నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి మాడపాకుల రమేష్ బాబు తెలిపారు. ఆదివారం దర్శి నగర పంచాయతీ గుజ్జుల సరళదేవి భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ సిపిఐ బస్సు యాత్ర ఈనెల 17న విశాఖపట్నంలో బయలుదేరి 8 వ తేదీన తిరుపతిలో ముగిస్తుందన్నారు. ఈ బస్సు యాత్ర ఈనెల 28 29 తేదీలలో తేదీలలో ప్రకాశం జిల్లాలో ప్రవేశిస్తుందని 29వ తేదీ ఉదయం 10 గంటలకు కనిగిరి పట్టణానికి చేరు కుంటుందని 11 గంటలకు పాముర్ఱుబస్టాండ్‌లో బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని, ఈ బహిరంగ సభను జయప్రదం చేసేందుకు జిల్లాలో ఉన్న వెలాది మంది సిపిఐ పార్టీ కార్యకర్తలు,సానుభూతిపరులు, ప్రజలు, ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాలు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభకు సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, సిపి ఐ పార్టీ రాష్ట్ర నాయకత్వం, జిల్లా నాయకత్వం పాల్గొంటారని ఆయన వివరించారు. మోడీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రసంగించడం జరుగుతుందన్నారు. తొలుత సిపిఐ పార్టీ కార్యకర్తలు బస్సు జాత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దర్శి సిపిఐ పార్టీ సహాయ కార్యదర్శి కే హనుమంతరావు,పట్టణ పట్టణ కార్యదర్శి జూపల్లి కోటేశ్వరరావు, దర్శి నియోజకవర్గ సిపిఐ కమిటీ నెంబరు కే.చిన్న ఆంజనేయులు. రాచపూడి కరుణానిధి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జేసీఎస్ కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే కేపీ పిలుపు

విశాలాంధ్ర-మార్కాపురం : మార్కాపురం నియోజకవర్గ జగనన్న సచివాలయం సురక్ష పథకాల అమలుకు సంబంధించిన సమావేశం ఆదివారం స్థానిక ఏ వన్ గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కె.పి నాగార్జునరెడ్డి హాజరై రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి పార్టీ క్యాడర్‌కు వివరించారు. పార్టీలకు వర్గాలకు రహితంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అందిస్తున్నారని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో వినూత్నమైన కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తుందని అన్నారు. ముఖ్యంగా విద్యా దీవెన, అమ్మఒడి పథకం ద్వారా విద్యారంగంలో ముఖ్యమంత్రి విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. జగన్ అమలు చేస్తున్న పథకాల గురించి నేడు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా 526 పైగా వివిధ ప్రభుత్వ సేవలు ప్రజలకు సత్వరంగా నేరుగా అందుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాల గురించి గ్రామ గ్రామాన ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి జెసి ఎస్ కన్వీనర్లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సెక్రెటరీ డాక్టర్ షంషీర్ అలీ బేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైసీపీ పట్టణ కన్వీనర్ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్‌కె ఇస్మాయిల్, జడ్పీటీసీలు వెన్నా ఇందిరా, నారు బాపన రెడ్డి, వైసీపీ బిసి సెల్ సెక్రటరి పి ఎల్ పి యాదవ్,జేసీఎస్ పట్టణ కన్వీనర్ పత్తి రవిచంద్ర, తర్లుపాడు మండల వైసిపి అధ్యక్షులు మురారీ వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గొలమారు శ్రీనివాస్‌రెడ్డి, వైసిపి పట్టణ ప్రధాన కార్యదర్శి బొగ్గరపు శేషయ్య, శ్రీశైలం దేవస్థానం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ కనకదుర్గ, ఎంపీపీలు పోరెడ్డి అరుణ చెంచిరెడ్డి, భూ లక్ష్మీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నాగారుపమ్మకు పూజలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండల కేంద్రమైన ముండ్లమూరులో గల యాదవ రాజుల ఇలవేల్పు శ్రీ నాగారుపమ్మ తల్లికి చుట్టూ ప్రక్కల పరిసర గ్రామాలతో పాటు ఇతర జిల్లాలలో ఉంటున్నటువంటి జమ్ములవారి ఆడపిల్లలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునుండే తలంటు స్థానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి ఆలయం వద్ద పొంగల్ పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి కొలువైన దేవర చెట్టుకు పసుపు కుంకుమార్చన పూజలు నిర్వహించిన అనంతరం నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించారు. దేవర గుడిలో ఉన్నబొల్లావులను బయటకు తీసి ప్రత్యేకంగా అలంకరించి వాటిని మోసుకుంటూ గ్రామంలోని వీధి వీధిలో ఉన్న ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయం నుండి బొడ్డు రాయి వద్ద పూజలు నిర్వహించారు. ఎక్కడెక్కడ నుండి వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసి పోయి గ్రామం మొత్తం సందడి వాతావరణం నెలకొంది.

నేషనల్ స్పోర్ట్స్ డే

విశాలాంధ్ర-మార్కాపురం : నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా ఈ నెల 21వ తేదీ నుండి 29వ తేదీ వరకు తపాలా సిబ్బందికి స్పోర్ట్స్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని మార్కాపురం డివిజన్ తపాల సూపరెంట్ కే శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం స్థానిక తపాలా కార్యాలయం నుండి 5 కే వాక్ 3 కే రన్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పోస్టల్ సూపరెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ తపాలా ఉద్యోగులతో ఉత్సాహాన్ని ఆరోగ్యాన్ని ఉల్లాసంగా పనిచేయడం కొరకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. స్పోర్ట్స్ డే వారోత్సవాల సందర్భంగా క్యారమ్స్, చెస్సు, బ్యాడ్మింటన్, క్రికెట్ తదితర కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అసిస్టెంట్ సుపరింటెంట్ మదనమోహన్ పోస్టు మాస్టర్ సయ్యద్ సుభాని, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'లో పాల్గొన్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మార్కాపురం : పట్టణంలోని 28వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి. గడపగడపలో ఎమ్మెల్యే కేపీకి ఘనంగా స్వాగతం పలికిన వార్డు కౌన్సిలర్ షేక్ కరిమూన్, ప్రజలు. వార్డులో గడప గడపకు తిరిగి సంక్షేమ పథకాలు వివరిస్తూ జరిగిన లబ్దిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి. ప్రభుత్వ పథకాల ద్వారా సంతోషంగా ఉన్నామని సంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు. మేలు జరిగిన ప్రతి కుటుంబం జగనన్నకు అండగా నిలవాలని పిలుపు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు కొత్త కృష్ణ, సిరాజ్, షేక్షావలి, దొడ్డ భాగ్యలక్ష్మి, భాను, అరుణ, హర్షిత బాబి, నాసరవలి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మయూరి కాసిం,గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, వైసీపీ నాయకులు శేషయ్య, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, కరీంభాష, వెంకటరెడ్డి, ఆసిఫ్ ఖాన్, మున్సిపల్ అధికారులు, వార్డు సచివాలయం అధికారులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మి చెన్న కేశవుడిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి రవీంద్ర

విశాలాంధ్ర-మార్కాపురం : శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి దేవాలయంలో ఆదివారం స్వామి వారిని దర్శించుకొన్న హైకోర్టు న్యాయమూర్తి వెంకట రవీంద్రబాబు, ధర్మపత్ని కృష్ణ కుమారి దంపతులు. న్యాయమూర్తి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయమూర్తి వెంకట రవీంద్ర బాబు దంపతులకు తొలుత ఆలయ కమిటీ చైర్మన్ పెనుగొండ కేశవరావు, ఇవో గోలమారు శ్రీనివాసరెడ్డిలు స్వాగతం పలికారు.

రాజన్న భోజనశాల ప్రారంభం

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలులో వైఎస్ఆర్సిపి నేత కామూరి రమణారెడ్డి ఐదు రూపాయలకే పేదలకు కడుపునిండా భోజనం అందించాలన్న ఉద్దేశంతో రాజన్న భోజనశాలను ఏర్పాటు చేశారు. ఈ భోజనశాలను ప్రారంభిం చేందుకు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు హెలికాప్టర్ ద్వారా మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిపై పూల వర్షం కురిపించే కార్యక్రమం కార్యక్రమానికే హైలైట్‌గా నిలిచింది. బేస్తవారిపేట నుండి నాయకుల, కార్యకర్తలతో కొమరోలుకు భారీ ర్యాలీ నిర్వహిస్తూ కొమరోలు తరలివచ్చారు. అనంతరం రాజన్న భోజనశాలను ప్రారంభించడంతో పాటు వైఎస్ఆర్సిపి నేత కామూరి రమణారెడ్డి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో బాలినేని, మాగుంట పాల్గొన్నారు. రాజన్న భోజనశాల ప్రారంభించడంతో పాటు రమణారెడ్డి గృహప్రవేశానికి విచ్చేశానని మాజీ మంత్రి బాలినేని మీడియాకు తెలిపారు. కామూరి తమకు పలికిన ఘనస్వాగతం ఎంతో ఆనందం అనిపించిందని మాజీ మంత్రి బాలినేని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు కీలక వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి సీపీఐ బస్సు యాత్రకు ఘనస్వాగతం పలకాలి

ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు : రైతాంగ, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసీపీ పార్టీలకు చరమగీతం పాడాలని పిలుపునిస్తూ ఈనెల 17న విశాఖలో ప్రారంభమైన సీపీఐ బస్సు యాత్ర ఈనెల 28న జిల్లాలోని మద్దిపాడు మండలం గ్రోత్ సెంటర్ వద్ద జిల్లాలోకి ప్రవేశిస్తున్న నేపద్యంలో రైతాంగం విరివిగా పాల్గొని బస్సు యాత్రకు ఘన స్వాగతం పలకాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హనుమారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలోని మతాల మధ్య చిచ్చు పెట్టి, మారణ హోమాలు సాగిస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ శాస్వతంగా దేశంలో పాలనసాగించాలని చూస్తుందన్నారు. ఇటువంటి ప్రభుత్వానికి ఒక్క క్షణం కూడా దేశాన్ని పాలించే హక్కు లేదన్నారు. అలాగే రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, కనీసం నిరసలు సభలు, సమావేశాలు నిర్వహించుకోనివ్వకుండా, వాక్ స్వాతంత్రానికి అడ్డుపడుతూ నిరంకుశ పాలన సాగిస్తుందన్నారు. ఇటువంటి వైసీపీని రానున్న ఎన్నికలలో చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. సీపీఐ బస్సు యాత్రలో రైతాంగం గ్రోత్ సెంటర్ వద్ద ఘన స్వాగతం పలకటంతో పాటుగా అక్కడ నుండి గుండ్లకమ్మ ప్రాజెక్టు సందర్శన, ఒంగోలులో నిర్వహించే బైక్ ర్యాలీలో రైతులు ఎక్కువ మంది పాల్గొన లన్నారు. అలాగే ఒంగోలు మల్లయ్య లింగం భవన్‌లో రైతాంగ సమస్యలపై నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నూతన ట్రాక్టర్‌ను ప్రారంభించిన ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద తెలుగుదేశం పార్టీ వీరాభిమాని తాటగిరి శ్రావణ్ కుమార్ నూతనంగా కొనుగోలు చేసిన ట్రాక్టర్ ను ఆదివారం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి పూజా కార్యక్రమం నిర్వహించి ప్రారంభిం చారు. శ్రావణ్‌కు శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బిజ్జం వెంకట్రామిరెడ్డి, శేఖర్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : ద్విచక్రవాహనంపై ప్రయాణించే వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్థానిక ఎస్ఐ పి అనిల్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వాహనదారులకు, ప్రజలకు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలు కాపాడుకోవాలని, అదే విధంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, విపరీతమైన వేగంతో వాహనాలపై వెళ్తూ ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని ఆయన సూచించారు. మీపై ఆధారపడిన వారు ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోతే అనాధలవుతారని కావున వాహనదారులు జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. ఫోర్‌వీలర్ వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణం చేయాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, ప్రజలు, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-కనిగిరి : ప్రజా కళాకారుడు, ప్రజాయుద్ధ నౌక గద్దర్ సంస్మరణ సభ ఒంగోలులోని ఎన్టీఆర్ కళాపరిషత్‌లో సెప్టెంబర్ రెండవ తేదీన జరుగుతుందని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పందిటి మోహన్ ఆదివారం తెలిపారు. ఆదివారం కనిగిరిలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కౌన్సిలర్ శ్రీరామ సతీష్ కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవికుమార్ మాదిగ, కుదారి రామ్మోహన్, బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు గంగరాజు యాదవ్, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు చెరుకూరి చిన్న కాశయ్య, కూడలి దశరథ, కటికల అగస్టీన్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

కామూరి గృహ ప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కొమరోలు : గిద్దలూరు వైసిపి నాయకులు కామూరి రమణారెడ్డి నూతనంగా నిర్మించిన కామూరి వారి రాజన్న నిత్య భోజనశాల, నూతన గృహాన్ని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, వారి తనయుడు అన్నా కృష్ణ చైతన్యలు సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా రాంబాబు, కృష్ణ చైతన్యలు ఎంపీపీ కామూరి అమూల్య, తాటిచర్ల ఎంపీటీసీ కామూరి శ్రీనివాసులురెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కామూరి రమణారెడ్డి ఏర్పాటు చేసిన కామూరి వారి రాజన్న నిత్య భోజనశాల నెలకొల్పి పేదవారి ఆకలి తీర్చడం గొప్ప విషయమని అన్నా రాంబాబు కొనియాడారు.

ప్రైవేటు కార్యక్రమంలో ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని ప్రశాంత్ నగర్‌లో నివాసం ఉంటున్న కీ.శే. వైజా భాస్కర్‌రెడ్డి మనుమరాలు మూల మల్లిఖార్జునరెడ్డి, స్రవంతి కుమార్తె చిన్నారి మీనాక్షి బారసాల కార్యక్రమంలో ఆదివారం నియోజక వర్గ టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బియ్యం ధరలు పైపైకి

- 26 కిలోల బస్తా రూ.1400- 1500
- విడిగా కిలో సుమారు రూ.60 రూపాయల పైనే
- అంతపెట్టిన ముద్దవుతున్న అన్నం
- కొత్త బియ్యం అంటున్న వ్యాపారులు
- మెల్లగా పెరుగుతున్న కందిపప్పు, చక్కెర, ఉల్లి

విశాలాంధ్ర-కనిగిరి : నిత్యవసర వస్తువుల ధరలు ఒక్కొక్కటి ప్రియంగా మారుతున్నాయి. మొన్నటి వరకు కిలో 100 రూపాయలకు పైగా పలికిన టమోటా ఇప్పుడు కాసింత కిందుకు దిగిరాగా బియ్యం ధరలు మాత్రం వారం వారం పెరిగిపోతున్నాయి. జీఎస్టి అవసరాల కోసం మిల్లర్లు 25 కిలోల బియ్యం బస్తాను 26 కిలోలు చేసిన సంగతి తెలిసిందే. గత రెండు నెలలుగా బియ్యం ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండటంతో ధాన్యం దిగుబడును తగ్గుతాయని అందుకే ఇప్పటినుంచే బియ్యం ధరలు పెంచడం మొదలు పెట్టారని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఆరు నెలల క్రితం 26 కిలోల బియ్యం బస్తా సన్నాలు రూ.1200 కి లభించేది. ఇప్పుడు అదే రకం బియ్యం రూ.1400 నుంచి రూ.1500 పెట్టాల్సి వస్తుంది. అంత మొత్తం పెట్టిన అన్నం ముద్ద అవుతుందని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లోకి వస్తున్న అన్ని రకాల బియ్యం కొత్తవని అందుకే ముద్ద అయిపోతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో చాలా మంది వ్యాపారులు తెలంగాణ, ఉభయ గోదావరి నుంచి బియ్యం దిగుపతి చేసుకుంటున్నారు. అక్కడే మిల్లర్ల బీపీటీ రకం సన్నబియానికి బస్తా 1300 నుంచి 1400 వరకు రేటు వేస్తున్నారు. అక్కడి నుంచి ఇక్కడికి లారీల్లో తీసుకొని రావడానికి బస్తాకు 100 వుంది అదనంగా ఖర్చవుతుంది .దీంతో పాటుగా డీజిల్ రేట్లు పెరిగిపోయాయి అని ఏపీ ప్రభుత్వం లారీలపై పన్ను పెంచిందని చెప్పి కిరాయిలు పెంచేశారు. ఇది కాకుండా దింపుడు కొలి బస్తాకు 9 రూపాలు అవుతుంది. ఈ ఖర్చులన్నీ భరిస్తూ బస్తాకు 25 రూపాయలు నుంచి 30 రూపాయలు లాభం వేసుకొని హెూల్సేల్ వర్తకులు అమ్ముతుంటే దానిపై మరో 25 రూపాయలు వేసుకొని రిటైల్ అమ్ముతున్నారు దాంతో ధరలు పెరిగిపోయాయి. ప్రకాశం జిల్లాలోని ఏ దుకాణంలోనైనా బియ్యం ధరలు పెంచి వినియోగదారులకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. బస్తా 1560 నుంచి 1580 వరకు విక్రయిస్తున్నారు. ఇంకా మరి కొన్నిచోట్ల 1600 వరకు పెట్టాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కందిపప్పుది అదే దారి : కందిపప్పు ధర మూడు నెలల క్రితం వరకు కిలో 130 ఉండేది. ఇప్పుడు ప్రస్తుతం 160 చొప్పున అమ్ముతున్నారు. హెూల్సేల్ డీలర్లకి రూ.100 కిలోల బస్తా 15,800 పడుతుంది. పాత స్టాకు ఉన్నవారు ఇంకా రూ.1505 నుంచి రూ. 1508 కే అమ్ముతున్నారు. గత రెండు రోజుల నుంచి కొత్త స్టాకు తీసుకున్న వారికి కొత్త ధర విక్రయించడంతో బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు 165 రూపాయలు చొప్పున అమ్ముతున్నారు. ఇక రెండో రకం కందిపప్పు కిలో 130కి విక్రయిస్తున్నారు.

చక్కెర కూడా పెరుగుతుంది : మొన్నటి వరకు కిలో పంచదార 40 రూపాయలకు లభించేది ఇప్పుడు కిలో 45కు చేరింది. హెూల్సేల్ లో 50 కిలోల బస్తా 1900 నుంచి 2050 వరకు ఉంది.

ఉల్లి కిలో రూ.40 : నెలరోజుల క్రితం వరకు ఉల్లి కిలో 20 రూపాయల లభించేది. టమోటా రేటు పెరిగినప్పటి నుంచి ఉల్లి పెరగటం మొదలైంది ఇప్పుడు ఉల్లి కిలో 40 రూపాయలకు అమ్ముతున్నారు టమోటా మాదిరిగా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఇటువంటి ఇబ్బందులు లేకుండా ఉల్లి ఎగుమతులను విదేశాలకు చేయకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ప్రజల కోరుతున్నారు.

చంద్రయాన్-3 విజయం జాతీయ వారసత్వ సంపద

విశాలాంధ్ర-ఒంగోలు : చంద్రయాన్ 3 విజయం జాతీయ వారసత్వ సంపదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పేర్కొన్నారు.సిపిఎం జిల్లా ప్లీనం సమావేశం ఆదివారం సుందరయ్య భవన్ లో జరిగింది. సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు పూనాటి ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడారు. చంద్రయాన్ 3 విజయం శాస్త్రవేత్తల కృషే నన్నారు. ఈ విజయాన్ని మోడీ మత రంగును పులిమేందుకు తహతహ లాడుతున్నారన్నారని విమర్శించారు. ఈ విజయం మోడీ సొంతం కాదని జాతీయ వారసత్వ సంపదన్నారు. టీటిడి అవినీతిపరులతో నిండి ఉందన్నారు. టీటిడి బోర్డులో ఎస్సి,ఎసిల ప్రాతినిధ్యం ఉండాలన్నారు. అర్చకమండలిలో ఆదివాసీలకు, దళితులకు స్థానం కల్పించా లని కోరారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో ప్రజలపై తీవ్ర భారం పడిందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిననాడు 400 ఉన్న సిలండర్ ధర నేడు 1200కి పెరిగిందన్నారు. పెట్రోలు, డీజిల్ ధరలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయన్నారు. కాయగూరల ధరలు, పప్పుల ధరలు ఆకాశనంటుతున్నాయన్నారు. టమోట ధరలు కిలో రూ. 200ల వరకు పెరిగిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విధ్యుత్ చార్జీలు పెంచి భారం మోపిందన్నారు. దేశంలోను, రాష్ట్రంలోను నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఈ సమస్యలపై 30 నుండి సమరభేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్కె హనీఫ్ సమావేశంలో ఆమోదించిన తీర్మానాలను పత్రికలకు విడుదల చేశారు.ప్లీనం సమావేశానికి అన్ని మండలాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవి కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, షేక్ మాబు పాల్గొన్నారు.

శిద్దా సుధీర్ కుమార్‌ని అభినందించిన ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

విశాలాంధ్ర-ఒంగోలు : ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఎలెక్ట్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కర రావు, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, శిద్దా సుధీర్ కుమార్‌ని వారి నివాసంలో ఆదివారం కలసి శుభాకాంక్షలు తెలిపారు. శిద్దా సుధీర్ కుమార్ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని వారు ఆకాంక్షించారు.,వై ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చుండూరి రవిబాబు శిద్దా సుధీర్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రకాశం జిల్లా రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ మాంటిస్సోరీ ప్రకాష్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, లయన్స్ సిటిజెన్ సభ్యులు శ్రీరామ్ రెడ్డి, పవన్ కుమార్, ఆంధ్రస్కూల్ శ్రీనివాస్ శిద్దా సుధీర్‌ను అభినందించారు. దర్శి రాజంపల్లికి చెందిన ఫణిదపు వెంకట్రామయ్య తన కుటుంబ సభ్యులు శిద్దా సుధీర్ కుమార్ ను అభినందించారు. అద్దంకికి చెందిన వ్యాపారవేత్త అరుణ్ కుమార్ బృందం, గుంటూరుకు చెందిన గుమ్మా గోపి యూత్ ఫోర్స్ సభ్యులు.దొనకొండ కు చెందిన శిద్దా యూత్ ఫోర్స్ సభ్యులు ఉప్పుటూరి కృష్ణారావు, గౌస్ బాషా, మణికంఠ ఆధ్వర్యంలో శిద్దా సుధీర్ కుమార్‌ను గజమాలతో సత్కరించారు. ఒంగోలు కు చెందిన శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ సభ్యులు శిద్దా సుధీర్ కుమార్‌ని కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీగిరి గిరి ప్రదక్షిణ బ్రోచర్‌ను శిద్దా సుధీర్ కుమార్ ఆవిష్కరించారు. జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు తన్నీరు ఆంజనేయులు ఆధ్వర్యంలో వడ్డెర సంఘం నాయకులు శిద్దా సుధీర్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రకాశంజిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు జలదంకి కృష్ణారావు వై.పాలెంకు చెందిన ఆర్యవైశ్య నాయ కులు, యిమ్మిడిశెట్టి సత్యనారాయణ, హరిప్రసాద్, చీమకుర్తి గోవింద మాల భక్త బృందం ఆధ్వర్యంలో శిద్దా సుధర్ కుమార్‌కు అభినందనలు తెలిపారు. ఒంగోలు, దర్శి, ముండ్లమూరు, అద్దంకి, వై.పాలెం ప్రాంతాలకు చెందిన ప్రముఖులు, శ్రేయోభిలాషులు శిద్దా సుధీర్ కుమార్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. దర్శి నియోజకవర్గం చలివేంద్ర వెంకటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు అధ్యక్షులు దారం వెంకటేశ్వరరెడ్డి, సందిరెడ్డిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునగ నాగరాజు, బొద్దికూరపాడు గ్రామానికి చెందిన పులి బ్రహ్మారెడ్డి, పులి కృష్ణారెడ్డి, అద్దంకికి చెందిన కొత్తమాసు ఈశ్వర గుప్తా, కొత్తమాసు మల్లిఖార్జున, తాళ్లూరి సుబ్బయ్య తదితరులు శిద్దా సుధీర్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

అగ్నికి ఆహుతయిన షర్బత్ తోట

విశాలాంధ్ర-త్రిపురాంతకం : త్రిపురాంతకం మండలంలోని కోస్టల్ సమీపంలోని పంట పొలాల్లో కౌలు రైతు షర్బత్ తోట అగ్నికి ఆహుతి అయింది. అగ్నికి ఆహుతి అయిన పంట సుమారు 4 ఎకరాలు వుంటుంది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పక్క వున్న చెత్తకు మంట వేయడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పక్క పొలాల నిర్వాహకులు చెపుతున్నారు. కౌల్ రైతు మస్తాన్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా షర్బత్ ఏర్లు సాగు చేస్తున్నానని అన్నారు. దీనికోసం సుమారు 6లక్షల రూపాయలు ఖర్చు చేశానని తెలిపారు. అగ్నికి ఆహుతి కావడంతో పూర్తి నష్టం జరిగిందని ప్రభుత్వం తనను ఆదుకొని న్యాయం చేయాలని కోరుకుంటున్నాడు.

మంచి సమాజ నిర్మాణమే ప్రతి ఒక్కరి ధ్యేయం

విశాలాంధ్ర-సింగరాయకొండ : మనుష్యల మధ్య అంతరాలు పెరిగి మానవతా విలువలు కనుమరుగవుతున్న ఈ రోజుల్లో ఆదర్శవంతమైన కార్యక్రమాల నిర్వహణకోసం ఏర్పాటైనదే మానవత సంస్థ అని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం శింగరాయకొండ లోని స్మార్ట్ జన్ గ్లోబల్ స్కూల్ నందు జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ప్రిన్సిపాల్ శాస్త్రి మాట్లాడుతూ మంచి కార్యక్రమం ఇక్కడ జరగడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కె.నారాయణ మాట్లాడుతూ ఇంకా ఎక్కువ మంది సభ్యులు గా చేరి సంస్థ కార్యక్రమాలను ముందుకు తీసుకుపోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.స్మార్ట్ జన్ స్కూల్ కరస్పాండెంట్ డా"గీతారాణి మాట్లాడుతూ మానవ చరమాంకంలో అంతిమ బాగమైన మరణం సంభవించినపుడు దూరం నుండి బంధువులు వచ్చేవరకు శవాన్ని జాగ్రత్త చేయలేని వారికి పూర్తి ఖర్చుతో మార్చురీ బాక్సులను సమకూర్చడం, పేదలకు వివిధ సహాయ కార్యక్రమాలు అందించడం లాంటివి చేయడం నిజంగా అభినంద నీయమని పేర్కొంటూ, నిజంగా ఉన్నతస్థాయిలో ఉద్యోగవిరమణ చేసిన వ్యక్తులు ఈ కార్యక్రమాలకు కేంద్రబిందువులు కావడం, వారికి హృదయ పూర్వక అభినందనలు తెలియజేశారు. జనవిజ్ఞానవేదిక నాయకులు డాక్టర్ హరిబాబు, ఎంఈఓ శివన్నారాయణ స్మార్ట్ జన్ స్కూల్ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి ఇందిరా కాలనీకి చెందినకి షేక్ పాచ్చా హుస్సేన్ ఇటీవల మరణించడంతో వైయస్సార్ భీమా లక్ష రూపాయలు చెక్కును నామిని సందానికి ఆదివారం కౌన్సిలర్ కామిశెట్టి దీప అందించారు. పేదలకు వైఎస్ఆర్ బీమా ఆర్థిక చేయూత అందిస్తుందని తెలిపారు. వైసీపీ నాయకులు పసుపులేటి అరుణోధర్ మాట్లాడుతూ వైస్సార్ భీమా పథకం పేదలకు వరమని అన్నారు. పాచ్చా హుస్సేన్ కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమం లో రసూల్ మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

శిద్దా సుధీర్‌ను అభినందించిన దారపనేని

విశాలాంధ్ర-పామూరు : కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ తిరుపతి తిరుమల వెంకటేశ్వర స్వామి ట్రస్ట్ బోర్డ్ పాలకమండలి సభ్యునిగా మాజీ మంత్రివర్యులు శిద్దా రాఘవరావు కుమారులు శిద్దా సుధీర్ ఎంపిక కావడం పట్ల కనిగిరి మాజీ ఏఎంసి చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. దేశంలో ఉన్న పుణ్యక్షేత్రాలలో అత్యంత గొప్ప చరిత్ర కలిగిన, మహిమగల తిరుపతి తిరుమల దేవస్థానానికి పాలకమండలి సభ్యునిగా ఎన్నిక కావడం గత జన్మ పుణ్యఫలం అని, ఆధ్యాత్మికంగా ఆ స్వామివారికి సేవ చేసుకునే భాగ్యం శిద్దా సుధీర్ బాబు కు కలిగినందుకు మనస్ఫూర్తిగా దారపనేని అభినందనలతో శుభాకాంక్షలు తెలిపారు. నాగేంద్రం, సిద్ధార్థ యాదవ్ శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

పీసీపల్లి ఎస్ఐగా కే.మాధవరావు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-పీసీపల్లి : పీసీపల్లి నూతన ఎస్ఐగా కే మాధవరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కే మాధవరావు బేస్తవారిపేట ఎస్సైగా విధులు నిర్వహిస్తూ బదిలీలలో భాగంగా పిసిపల్లి పోలీస్ స్టేషన్‌కు ఎస్సైగా నియమితులయ్యారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన ఏ నాగేశ్వరరావు విఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ కే మాధవరావు మాట్లాడుతూ సమస్యలేమైనా ఉంటే ప్రజలు తనను నేరుగా కలిస్తే ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని, రాత్రి వేళల్లో దొంగతనాలు జరగకుండా గస్తీని ముమ్మరం చేస్తామని ముఖ్యంగా పేకాట బెల్ట్ షాపులు నిర్వహించినా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

గుంటి గంగలో భక్తుల కోలాహలం

విశాలాంధ్ర-తాళ్లూరు : ప్రకాశం జిల్లాలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తాళ్లూరు మండలం తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలో గల గుంటి గంగక్షేత్రంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. మండలంలోని వివిధ గ్రామాల నుండే కాక జిల్లా నలుమూలల నుండి భక్తులు పాల్గొని నైవేద్యాలతో అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుండి ఆలయ పూజారిణి పి విజయలక్ష్మి గుంటి గంగ మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలతో, పూలమాలలతో, బంగారు, వెండి ఆభరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. దేవాదాయ శాఖ ఈవో ఏబి భాస్కర్ రెడ్డి దేవాలయంలో ఉండి భక్తులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. 468 దర్శనం టికెట్లు, 12 వాహన పూజలు జరిగాయని, భక్తులు అమ్మవారికి 6 చీరలు, 13,625 రూపాయల విరాళాలు అందించారని, ఆదివారం ఒక్కరోజు 18965 రూపాయల ఆదాయం లభించినట్లు దేవాదాయ శాఖ రికార్డ్ అసిస్టెంట్ కే శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవదాయ శాఖ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పోలేరమ్మకి జలాభిషేకం

విశాలాంధ్ర-ముండ్లమూరు : సకాలంలో వర్షాలు పడి రైతులు అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుతూ ఉదయం 6 గంటల నుండి గ్రామంలోని అన్ని దేవాలయాలకు 101 బిందెలతో జలాభిషేకం చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో జలాభిషేకంలో పాల్గొని పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు కుల మతాలకు అతీతంగా ఉంద్రాళ్ళు కుడుములతో నైవేద్యం తీసుకువెళ్లి పోలేరమ్మ అమ్మవారికి సమర్పించారు.

ముద్దర్స్ సుబ్బయ్యకు నివాళి

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని కొంగలవీడు రోడ్డులో అనారోగ్యంతో మరణించిన ముద్దర్స్ సుబ్బయ్య (77) మృతి పట్ల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదివారం భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఆయన వెంట పట్టణ టీడీపీ అధ్యక్షులు సయ్యద్ శానేశావలి, స్థానిక కౌన్సిలర్ భర్త బిల్లా రమేష్ యాదవ్ నివాళులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, తదితరులు అర్పించారు.

జగన్ ముస్లింలకు చేసింది శూన్యం

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్
- ఘనంగా ముస్లీంల ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర-ఒంగోలు : ముస్లీం సోదరులకు జగన్ ముఖ్యమంత్రిగా చేసిందేమీ లేదని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు అన్నారు. స్థానిక ఇస్లాంపేటలో ఆదివారం ముస్లీం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ కోసం బుల్లెట్ కంటే వేగంగా దూసుకువస్తానన్న సైకో జగన్ 2020లో హాజీర అనే ముస్లీం యువతిని అత్యాచారం చేసి హత్య చేస్తే ఇప్పటి వరకు ఎందుకు న్యాయం చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. పనలమనేరులో 10వ తరగతి విద్యార్థిని మిస్బా ఆత్మహత్య కారకులపై ఎందుకు చర్య తీసుకోలేదన్నారు. అదేమంటే లేని దిశ చట్టం పనిచేస్తున్నట్లు ముఖ్యమంత్రికి పరిపాటిగా మారిందన్నారు. వైసీపీ నాయకులు పెట్టిన ఇబ్బందులు తట్టుకోలేక నంద్యాలలో సలాం కుటుంబం సామూహిక ఆత్మహత్య చేసుకున్నారు. దీనికి కారణమైన వారిని నేటికి ఎందుకు శిక్షించలేదన్నారు. ఒంగోలులో అయితే పిల్లసైకో ముస్లీంలపై అక్రమ కేసులు పెడుతూ పైశాచికానందం పొందుతున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముస్లీంలకు ఇస్లామిక్ బ్యాంకు పెట్టి వడ్డీ లేని రుణాలు ఇస్తానని మోసం చేశాడన్నారు. మైనార్టీ కార్పోరేషన్ ద్వారా ఇస్తానని రుణాలు ఎక్కడో చెప్పాలన్నారు.దుల్హన్ పథకం ద్వారా రూ.1లక్ష ఇస్తానని హామీ ఇచ్చి నాలుగు సంవత్సరాల తర్వాత అసలు సంబంధం లేని పదో తరగతి పరీక్ష పాస్ కావాలని నిబంధనలు పెట్టి ముస్లీం యువతీ,యువకులను జగన్ మోసం చేశాడన్నారు. వక్ఫ్ బోర్డుకు నయాపై ఖర్చుపెట్టకపోగా వాటి ఆస్తులను వైసీపీ నేతలే ఖబ్జాలు చేస్తుంటే చోద్యం చూస్తున్నారన్నారు. మైనార్టీలకు విదేశీ విద్య అందని ద్రాక్ష పండులా మారిందన్నారు.టిడిపి హయాంలో జిలాల్ నగర్‌కు ఇస్లాంపేటలో స్థలం కేటాయించి కమ్యూనిటీ హాలు నిర్మించామన్నారు. ఒంగోలు నియోజక వర్గంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ద్వారా 745 మందికి వ్యక్తిగత రుణాలు ఇప్పించామన్నారు. రూ.36 లక్షలతో ఈద్గా ఫ్లోరింగ్ నిర్మాణం చేపట్టామన్నారు. రూ.2 కోట్లతో ముస్లీంలకు షాదీఖానా నిర్మించామన్నారు. రూ.20 లక్షలతో ముస్లీం ఖబరస్థాన్‌ను అభివృద్ధి చేశామన్నారు. ఒంగోలు నియోజక వర్గంలో 300 మంది ముస్లీం మహిళలకు కుట్టుమిషన్‌లు పంపిణీ చేశామన్నారు. ఇవే కాదు ముస్లీం మైనార్టీలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందించామన్నారు.

ఈ కార్య క్రమంలో ఒంగోలు మాజీ మున్సిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, ఒంగోలు నగర టిడిపి అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ కపిల్,రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పఠాన్ హనీఫ్ ఖాన్,షేక్ అజీమున్నీసా పాల్గొన్నారు.

ఆక్రమణదారులు నిర్మించిన కట్టడాలను తొలగించిన రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి అర్బన్ కాలనీలో పేదల ఇండ్ల స్థలాలను ఆక్రమించుకొని ఏదేచ్ఛగా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న వైసీపీ నాయకుల ఆగడాలకు రెవెన్యూ అధికారులు ఆదివారం కళ్లెం వేశారు. 'కనిగిరిలో రెచ్చి పోతున్న భూ ఆక్రమణదారుల' కథనం శనివారం 'విశాలాంధ్ర' దిన పత్రికలో ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆర్డీఓ తోట అజయ్ కుమార్ అర్బన్ కాలనీలో సర్వేనెంబర్ 42/2, 42/3, 42/4 వైసిపి నాయకులు అధికారమే వారి పెట్టుబడిగా సాగిస్తూ అధిక పార్టీ ముసుగులో బడా నాయకులు పేదలు ఇళ్లస్థలాలను ఆక్రమించుకుని నిర్మించిన కట్టడాలను జెసిబితో తొల గించారు. పేదల స్థలాలను ఆక్రమించి కట్టడాలు చేపడితే ప్రభుత్వ పరమైన చర్యలు తీసుకుంటామని ఆక్రమణ దారులను ఆర్డీఓ తోట అజయ్ కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులతో పాటు సిఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ దాసరి ప్రసాద్, విద్యుత్ అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేరగాళ్లకు టీడీపీ పాలక కమిటీలో స్థానాలా సిగ్గుసిగ్గు : బీజేపీ

విశాలాంధ్ర-ఒంగోలు : తిరుపతి, తిరుమల దేవాలయ పాలక కమిటీలో అన్యమతస్తులకు, నేరచరిత్ర కలిగిన వారికి స్థానం కల్పించటం హిందువుల మనోభావాలు దెబ్బతీసేందుకే అని, ఇది వైసీపీ ప్రభుత్వం సిగ్గుపడాల్సిన విషయమని బిజెపి ఒంగోలు నియోజక వర్గం కన్వీనర్ యోగయ్యయాదవ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ కార్యాలయంలో టీటీడి పాలక మండలి లో అన్యమతస్తులను నియమించటాన్ని వ్యతిరేకిస్తూ వివిధ హిందూ సంఘాల నాయకులు తో భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించటం జరిగింది.ఈ కార్యక్రమానికి యోగయ్య యాదవ్ అధ్యక్షత నిర్వహించి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి అధికారానికి వచ్చిన దగ్గరనుండి హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహారిస్తూ అనేక గుళ్ల ను ధ్వంసం చేయడం కాకుండాఇటీవల టీటీడీ పాలక మండలిలో టీటీడీ చైర్మన్‌గా ఒక నాస్తికుడు. క్రిస్టియన్ మతస్థుడు. స్వామి వారి తిరునామం గానీ. బొట్టు గానీ పెట్టుకోని వ్యక్తి భూమన కరుణాకర్ రెడ్డి గారిని టీటీడీ బోర్డు అధ్యక్షులుగా నియమించటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.